అభినందనలు

సీనియర్ సౌత్ జోన్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్ షిప్ బాలికల జట్టుకు సీతాఫల్‌మండి డివిజన్‌కు చెందిన ప్రవళిక ఎంపికైంది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ గురువారం టకారాబస్తీలోని ఆయన నివాసంలోప్రవళికను అభినందించారు.

– సికింద్రాబాద్, జనవరి 11

నేడు లష్కర్‌లో విద్యుత్ ఉండని ప్రాంతాలు

బేగంపేట్ జనవరి 11: లాలాగూడ, బన్సీలాల్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ విద్యుత్ ఏడీఈ గురువారం తెలిపారు.

● లాలాగూడ సబ్‌స్టేషన్ శాంతినగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ● విజయ్‌పురి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయం త్రం 5 వరకు ● బన్సీలాల్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని సీసీ నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, ● హైదర్‌బస్తీ ఫీడర్ పరిధిలో 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి

● అధికారులతో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని

కుమ్మరి బస్తీలో చేపట్టాల్సిన పనులపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట్, జనవరి 11 : పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. గురువారం అమీర్‌పేట్ డివిజన్‌లోని కుమ్మరిబస్తీలో పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలకు ముందు కుమ్మరి బస్తీలో మంజూరైన మంచినీరు, డ్రైనేజీ నిర్మాణ పనులకు సంబంధించిన అంశాలను జలమండలి జీఎం హరిశంకర్, డీజీఎం వంశీకృష్ణలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలన్ని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ ఎంసీ ఈఈ ఇందిర, డీఈఈ మోహన్, స్ట్రీట్ లైట్స్ డీఈ కిరణ్మయి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎం. హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి సంతోష్ మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

■ ప్రత్యేక పూజలు

అమావాస్యను పురస్కరించుకొని బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేశ్ గురువారం బొల్లారం మహంకాళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు బాల్‌రాజు,మురళీధర్ యాదవ్,శ్రీనివాస్,వినోద్,సాయిబాబా, జగన్, రేవతి,కిరణ్, స్వాతి పాల్గొన్నారు.

– బొల్లారం,జనవరి 11

వాణిజ్య వాతావరణం నెలకొల్పాలి

● మెడిసినల్ ప్లాంట్స్ బయ్యర్స్ మీట్‌లో వక్తలు



బయ్యర్ల సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

అమీర్‌పేట్, జనవరి 11 : కేరళ అటవీ పరిశోధక సంస్థ ఆధ్వర్యంలో గురువారం బేగంపేట్‌లోని హోటల్ హరిత ప్లాజాలో మెడిసినల్ ప్లాంట్స్ బయ్యర్స్ మీట్– 2024 జరిగింది. ఈ సమావేశంలో రైతులు, కొనుగోలుదారుల మధ్య వాణిజ్య వాతావరణం నెలకొల్పేందుకు అవసరమైన చర్యలపై చర్చించారు. 24 రకాల వివిధ ఔషధ మొక్కలను దేశంలోని 11 రాష్ట్రాలతో పాటు నేపాల్ రైతులు ఉత్పత్తి చేస్తున్నారన్నారు. ప్రతి యేటా 20 వేల టన్నుల ఔషధ మొక్కల ఉత్పత్తి జరుగుతున్న నేపథ్యంలో ఇరువురి మధ్య చక్కటి వాతావరణం నెలకొల్పేందుకు వేదికగా మెడిసినల్ ప్లాంట్స్ బయ్యర్స్ మీట్ నిలుస్తుందన్నారు. రాష్ట్ర ఔషధ మొక్కల సంస్థ సీఈవో సోనీ బాలాదేవి, అటవీశాఖ ఐజీ డాక్టర్ త్రినాథ్‌కుమార్, జాతీయ ఔషధ మొక్కల సంస్థ మార్కెటింగ్ మేనేజర్ సౌరబ్ శర్మ, ఎన్ఎంసీబీ ప్రాజెక్ట్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ కేసీ చాకో , దక్షిణాది రాష్ట్రాల అధికారులు పాల్గొన్నారు.

ఎల్ ఓసీ అందజేత

సికింద్రాబాద్, జనవరి 11 : మెట్టుగూడలోని ఆలుగడ్డ బావి ప్రాంతానికి చెందిన ఉమామహేశ్వర్‌రావు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయాన్ని ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సీఎం సహాయనిధికి దరఖాస్తు చేయించారు. ఈ మేరకు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరైన ఎల్వోసీ పత్రాన్ని గురువారం ఎమ్మెల్యే పద్మారావు తన క్యాంపు కార్యాలయంలో బాధితుడికి అందజేశారు.

విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న రాష్ట్రపతి నిలయ అధికారులు, సిబ్బంది

రాష్ట్రపతి నిలయంలో జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు

బొల్లారం,జనవరి 11:జాతీయ రహదారి భద్రత వారోత్సవాలు గురువారం బొల్లారం రాష్ట్రపతి నిలయంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుమలగిరి మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ భోదిశ్రీ, ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ రోడ్ సేఫ్టీ చైర్మన్ వినోద్‌కుమార్,ఆరిజిన్ ఫార్మాస్యూటికల్స్ ప్రాజెక్ట్ ఇంజినీరింగ్ చైర్మన్ దీపెన్ శ్రోఫ్ హాజరయ్యారు. రాష్ట్రపతి నిలయం సిబ్బందితో కలిసి వివిధ పాఠశాలల విద్యార్థులు భద్రతా వారోత్సవాల ర్యాలీ చేపట్టారు. అనంతరం రహదారి భద్రత వీడియోలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి నిలయ అధికారి రజినీప్రియ మాట్లాడుతూ.. రహదారి భద్రత ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్రపతి నిలయ సిబ్బంది, ఐటీబీపీ, ఎన్జీఓస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

■ సీఎంఆర్ పాఠశాల వార్షికోత్సవం

బోయిన్‌పల్లిలోని సీఎంఆర్ పాఠశాలలో వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. – బొల్లారం, జనవరి 11

దశల వారీగా సమస్యలు పరిష్కారం

అడ్డగుట్ట, జనవరి 11 : ప్రజా సమస్యల పరిష్కారానికి అన్నివిధాలుగా కృషి చేస్తున్నట్లు మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత అన్నారు. డివిజన్ పరిధిలోని విజయపురి కాలనీలో ఆమె అధికారులతో కలిసి పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఓపెన్ నాలా ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... దశల వారీగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎమ్‌సీ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

త్వరలో సీవరేజీ లైన్ పనులు ప్రారంభం

సికింద్రాబాద్, జనవరి 11: సీతాఫల్‌మండిలో రూ. 38 లక్షలతో చేపట్టనున్న సీవరేజీ లైన్ నిర్మాణ ప్రాంతాన్ని గురువారం కార్పొరేటర్ హేమ అధికారులతో కలిసి పరిశీలించారు. త్వరలోనే పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రాజెక్ట్ మేనేజర్ మనోహర్, వాటర్‌వర్క్స్ మేనేజర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి..

సీతాఫల్‌మండి డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని కార్పొరేటర్ సామల హేమ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఇంజినీర్ చీఫ్ జియా ఉద్దీన్‌కు విన్నవించారు.

డివిజన్‌లో పనులు పూర్తి చేయండి

బేగంపేట్ జనవరి 11: రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బేగంపేట్ సర్కిల్ ఉప కమిషనర్ శంకరయ్యకు కార్పొరేటర్ చీర సుచిత్ర గురువారం వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లో పారిశుద్ధ్య కార్మికులు అరకొరగా హాజరవుతున్నారని తెలిపారు. స్వచ్ఛ ఆటోలు కూడా సరిగ్గా రావడం లేదన్నారు. వీధి దీపాలు వెలగడం లేదన్నారు. పబ్లిక్ టాయ్‌లెట్స్ నిర్వాహణ కూడా పట్టించుకోక పోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు జీరా, మెహ్లాడ్‌గూడ ప్రాంతాల్లో పార్కు పనులు ఇప్పటివరకు పూర్తి కాలేదన్నారు. అధికారులు చర్యలు తీసుకొని అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకర్‌రావు

పాత పెన్షన్ ఇచ్చేవాళ్లకే.. మా ఓటు

● రైల్వే మజ్దూర్ యూనియన్

మారేడ్‌పల్లి, జనవరి 11:ఏఐఆర్ఎఫ్, జేఎఫ్ఆర్ఓపీఎస్ పిలుపు మేరకు మజ్దూర్ ఆధ్వర్యంలో రైల్ నిలయం ఎదుట గురువారం రైల్వే ఉద్యోగులు నిరాహార దీక్ష చేపట్టారు. అంతకుముందు రైల్వే కార్మికులు సికింద్రాబాద్ సంచాలన్ భవన్ నుంచి రైల్‌నిలయం ప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకర్‌రావు మాట్లాడుతూ.. పాత పెన్షన్‌విధానం అమలు చేసే రాజకీయ పార్టీలకే రైల్వే కార్మికుల మద్దతు ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ జోనల్ ప్రెసిడెంట్ కాల్వ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ మురళీధర్, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీలు ఉదయభాస్కర్, బారాటే, రామకృష్ణ, జోనల్ కోశాధికారి సరోజినీ రెడ్డి, సికింద్రాబాద్ డివిజనల్ సెక్రటరీ రవీందర్, మజ్దూర్ నాయకులు పాల్గొన్నారు.

అమావాస్య పూజలు.. అన్నదానం

అన్నదానం చేస్తున్న జంపన ప్రతాప్, ఆలయ కమిటీ సభ్యులు

బొల్లారం/కంటోన్మెంట్, జనవరి 11: అమావాస్యను పురస్కరించుకొని కంటోన్మెంట్ బాపూజీనగర్‌లోని దేవి నల్లపోచమ్మ ఆలయంలో గురువారం బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు దుర్గయ్య, రామారావు, ప్రేమ్‌కుమార్, అజిత్ కళ్యాణ్, నరసింహ, జాజుల క్రాంతి పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో..

న్యూబోయిన్‌పల్లిలోని జయనగర్ ముత్యాలమ్మ ఆలయంలో గురువారం అమావాస్య సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముప్పిడి మధుకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

మార్చి 10న ఉత్తమ పరిశోధన పత్రం పోటీలు

ఖైరతాబాద్ : సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ తెలంగాణ, నిమ్స్ సంయుక్తాధ్వర్యంలో మార్చి 10న ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు జాతీయ స్థాయి పరిశోధన పత్రం పోటీలను నిర్వహించనున్నారు. గురువారం బ్రోచర్లను నిమ్స్ దవాఖానలో ఆవిష్కరించారు.

ఎంఎస్ఎఫ్ నూతన కమిటీ

సికింద్రాబాద్, జనవరి 11: మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్(ఎంఎస్ఎఫ్) సంస్థాగత నిర్మాణంలో భాగంగా గురువారం ఉస్మానియా యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ సెమినార్ హాల్‌లో ఎంఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ నేతృత్వంలో యూనివర్సిటీ మాదిగ విద్యార్థుల సమావేశాన్ని నిర్వహించారు.. అనంతరం నూతన కమిటీని నియమించి నియామక పత్రాలు అందజేశారు.

నూతన కమిటీ అధ్యక్షుడిగా మంద రాజు, అధికార ప్రతినిధిగా దినేశ్, ప్రధాన కార్యదర్శులు నవీన్, రవితేజ, విష్ణు, ఉపాధ్యక్షులు శ్రీకాంత్, తిరుపతి, బైకాడి ప్రవీణ్, రిషి, కార్యదర్శులుగా జీ. సింహాద్రి, దుర్గాప్రసాద్, అరుణ్ మాదిగ, డి. నర్సింహ, సహాయ కార్యదర్శులుగా నిఖిల్, కాశీ, రమేశ్, ప్రచార కార్యదర్శులుగా జూటూరు జాన్, అశోక్, కోఆర్డినేటర్‌గా సునీల్ గవాస్కర్, ఇన్‌చార్జిగా వంశీరాజ్‌ను నియమించారు.

మహిళలను టార్గెట్ చేస్తూ.. చోరీలు

● 14.3 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

మారేడ్‌పల్లి, జనవరి 11: మహిళా ప్రయాణికులను టార్గెట్ చేస్తూ.. వారి మెడలోని బంగారు ఆభరణాలను చోరీ చేస్తూ..తప్పించుకొని తిరుగుతున్న దొంగను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి వద్ద నుంచి 14.3 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. గురువారం సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ కార్యాలయంలో రైల్వేస్ అదనపు డీజీ మహేష్ భగవత్, సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ సలీమా కేసు వివరాలు వెల్లడించారు. న్యూ బోయిగూడలోని రైల్వే క్వార్టర్స్‌కు చెందిన చిన్నయ్య వీరరాఘవులు ఆకాశ్ ఇంటర్ వరకు చదివి మానేశాడు. ప్రస్తుతం డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. జల్సాలకు అలవాటుపడిన అతను దొంగతనాలు చేయాలని ప్లాన్ వేశాడు. అనుకున్నదే తడువుగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, సంజీవయ్య పార్కు తదితర రైల్వే స్టేషన్లలో ఒంటరిగా ప్రయాణించే మహిళల మెడలో నుంచి బంగారు నగలను చోరీ చేస్తున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు సికింద్రాబాద్ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ముమ్మరం చేశారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడు ఆకాశ్‌ను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా చోరీలు చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వెంట రైల్వే డీఎస్పీ ఎ. నర్సింహ, ఎస్ఐ మాజీద్, క్రైం సిబ్బంది మహిపాల్‌రెడ్డి, భవానీ శంకర్, ఆర్పీఎఫ్ పోలీసు సిబ్బంది శ్రీనివాస్, కృష్ణ ఉన్నారు.

క్రమబద్ధీకరణ చేయండి

అమీర్‌పేట్, జనవరి 11: జల మండలిలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతుల్లో విధులు నిర్వర్తిస్తున్న స్కిల్డ్, సెమీ స్కిల్డ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరుతూ సంస్థ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు పట్లోళ్ల మాణిక్ రెడ్డి, సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు.

ఆక్రమణలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

డబుల్ బెడ్‌రూం ఇంటికి తాళం వేయిస్తున్న తాసీల్దార్ పద్మసుందరి

అడ్డగుట్ట, జనవరి 11 : ఆక్రమణలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మారేడ్‌పల్లి మండల తాసీల్దార్ పద్మసుందరి హెచ్చరించారు. ఆజాద్‌చంద్రశేఖర్ నగర్‌లో ఖాళీగా ఉన్న నాలుగు డబుల్ బెడ్‌రూం ఇండ్ల తాళాలు పగులగొట్టి కొందరు అక్రమంగా ఉంటున్నారని పలువురు బస్తీవాసులు తాసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన తాసీల్దార్ బస్తీలోని సదరు నాలుగు డబుల్ బెడ్‌రూం ఇండ్లను గురువారం సందర్శించి వాటిల్లో నివసిస్తున్న వారిని ఖాళీ చేయించారు. అనంతరం తాసీల్దార్ మాట్లాడుతూ.. బ్లాక్ – 2లోని 301, 303, బ్లాక్ – 3 లోని 302, బ్లాక్ – 5 లోని 301 నాలుగు ఇండ్లు ఇంకా ఎవరికీ కేటాయించలేదన్నారు. అందులోకి ఎవరైనా ప్రవేశిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

సమాజంపై అవగాహన పెంచుకోవాలి

విద్యార్థులు చేసిన గాడ్జెట్స్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ ఈవో చిరంజీవులు, ఐవోఎస్‌లు

బేగంపేట్ జనవరి 11: విద్యార్థులు సమాజంపై అవగాహన పెంచుకొని పెద్దలు చెప్పింది విని శ్రద్ధగా నేర్చుకోవాలని సికింద్రాబాద్ డిప్యూటీ ఈవో చిరంజీవులు సూచించారు. గురువారం సికింద్రాబాద్ ఎస్పీ రోడ్డులోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యాలయంలో జరుగుతున్న తృతీయ సోపాన్ శిక్షణ శిబిరాన్ని డిప్యూటీ ఐవోఎస్‌లు సుమన్ రాథోడ్, కస్తూరి కుమారితో కలిసి ఆయన సందర్శించారు.అనంతరం డిప్యూటీ ఈవో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో స్కౌటింగ్, గైడింగ్‌లు లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని తిరిగి పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కే రమేష్‌చందర్, సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, భతేనా, గౌరీనాథ్, మల్లారెడ్డి, వనం రాజు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ చోరీ, ఆపై హత్య : నిందితుడు అరెస్టు

మారేడ్‌పల్లి, జనవరి 11: జల్సాలకు అలవాటుపడి.. ఓ ప్రయాణికుడి సెల్‌ఫోన్ చోరీ చేసి అతడిని హత్య చేసిన కేసులో నిందితుడిని కాచిగూడ రైల్వే పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రైల్వేస్ అదనపు డీజీపీ మహేశ్ భగవతి, సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ సలీమా వివరాలను వెల్లడించారు. చాదర్‌ఘాట్ అజాంపురకు చెందిన మహమ్మద్ సోహెల్ (24) కూలీ.

జల్సాలకు అలవాటుపడి డబ్బుల కోసం ఈ నెల 6న డబీల్‌పురా రైల్వే స్టేషన్‌లోని 2వ నంబర్ ప్లాట్ ఫారంపై ఉన్న ఓ ప్రయాణికుడిని పక్కకు తీసుకెళ్లి సెల్‌ఫోన్ లాక్కొని అతడిని కత్తితో పొడిచి హత్య చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి.. సీసీ పుటేజీల ఆధారంగా గురువారం నిందితుడిని అరెస్టు చేశారు.

కేసును ఛేదించిన జీఆర్పీ డీఎస్పీ నర్సయ్య, కాచిగూడ ఇన్‌స్పెక్టర్ బీజీ ప్రసాద్ రావు, కానిస్టేబుళ్లు రామిరెడ్డి, వన్‌పాల్, హరీశ్, లక్ష్మీకాంత్‌లకు అదనపు డీజీ మహేశ్ భగవత్ రివార్డులు అందజేశారు.

■ సొంతూళ్లకు పయనం

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నగర ప్రజలు పల్లెబాట పట్టారు. గురువారం జూబ్లీ బస్ స్టేషన్ నుంచి సొంత ఊళ్లకు పయనమైన విద్యార్థులు.

వినతి

మోండామార్కెట్ డివిజన్‌లో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయాయని వాటిని సత్వరమే పరిష్కరించాలని కోరుతూ ఎంఐఎం నాయకులు గురువారం జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అధికారులు స్పందించి ఈ సమస్యపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

– బేగంపేట్ జనవరి 11

పాఠశాలలో సంక్రాంతి సంబురాలు

బన్సీలాల్‌పేట్, జనవరి 11 : భోలక్‌పూర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. విద్యార్థులు పాఠశాల ఆవరణలో తెలంగాణ సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ ఆకట్టుకునేలా చక్కటి చుక్కల ముగ్గులు వేశారు. అనంతరం ఉపాధ్యాయులు ఉత్తమ ముగ్గులను ఎంపిక చేశారు. వారిని హెచ్ఎం కే.మల్లికార్జున్‌రెడ్డి అభినందించారు.

షెడ్డు నిర్మాణ పనులు పరిశీలన

బన్సీలాల్‌పేట్, జనవరి 11 : జీహెచ్ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ ప్రధాన ద్వారం వద్ద రూ.9 లక్షలతో నిర్మించిన షెడ్డును గురువారం బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కే.హేమలత పరిశీలించారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు కే.లక్ష్మీపతి, అబ్బాస్, మురళి, వెంకటేశ్, రాజు తదితరులు ఉన్నారు.